www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 11 నవంబర్ 2024

## నేడు యథావిధిగా 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

**ప్రజాశక్తి-రాయచోటి**

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ఈనెల 30న సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

# గళం విప్పేనా?

**ఉక్కు సంకల్పం ప్రదర్శించేనా**

**కొప్పర్తి ఎంఎస్ఎంఇపై స్పష్టత లభించేనా**

**నిలిచిన జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనులు**

**నత్తనడకన కృష్ణా-పెన్నా ఎత్తిపోతల పథకాలు**

**నేటి నుంచి శాసనసభ సమావేశాలు**

**ప్రజాశక్తి - కడప ప్రతినిధి**

జిల్లా అభివృద్ధి 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా మారింది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో శాసనసభ సమావేశాల్లో పాలక, ప్రతిపక్ష ప్రజా ప్రతినిధులు గళం విప్పాల్సిన అవసరం ఉరుముతోంది. రాష్ట్ర విభజన చట్టంలో ఆర్నెళ్లలో కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, వెనుకబడిన జిల్లాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇస్తామనే హామీల అమలు చేయాలని పేర్కొన్న సంగతి తెలిసిందే. 2014లో విభజిత రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు శాసనసభ తొలి సమావేశాల్లో ఒక్కో జిల్లాను తనదైన శైలిలో అభివృద్ధి చేస్తామని హామీల వర్షం కురిపించారు. టిడిపి, వైసిపి పాలనలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటులో ఎటువంటి పురోగతీ లేకపోవడం ఆందోళన కలిగించింది. రాయలసీమకు గుండెకాయ గండికోట సాగునీటి ప్రాజెక్టు. ఇటువంటి ప్రాజెక్టుకు డిస్ట్రిబ్యూ టరీలు లేకపోవడంతో అలంకారప్రాయంగా దర్శనమిస్తోంది. దీనికితోడు గాలేరు-నగరి ఫేజ్-2 పనులకు గ్రహణం వీడలేదు. వెలిగల్లు రిజర్వాయర్‌కు డిస్ట్రిబ్యూటరీలు చేపట్టకపోవడంతో ఆశించిన ప్రయోజనం నెరవేర లేదు. కుందూ-పెన్నా, వెలిగల్లు, కాలేటివాగు ఎత్తిపోతల పనుల్లో పురోగతి కనిపించడం లేదు. కడప సూపర్‌స్పెషాలిటీ నిపుణుల నియామకాలు, పరి కరాల ఏర్పాటు, టెక్నీషియన్ల నియామకాలు ఎప్పుడు చేపడతారో తెలియ డం లేదు. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో నేటి నుంచి శాసనసభ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లా ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు గళం విప్పాల్సిన అవసరం ఎంతై నా ఉందనడంలో సందేహం లేదు.

రాష్ట్ర శాసనసభ సమావేశాల నిర్వహణకు రంగం సిద్ధమైంది. ఈమే రకు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు రాజధానికి చేరుకున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కడప, అన్నమయ్య జిల్లాల్లోని 13 నియోజకవర్గాలు, రెండు ఎంపీ స్థానాలు ఉన్నాయి. ఇందులో రెండు పార్లమెంట్ స్థానాలను వైసిపి, 13 శాసనసభ స్థానాల్లో మూడు మినహా 10 స్థానాల్లో ఒక్కొక్కటి చొప్పున జనసేన, బిజెపి దక్కించుకోగా, మిగిలిన ఎనిమిది స్థానాల్ని టిడిపి కైవసం చేసుకుంది. ఈనేపథ్యంలో జిల్లా అభివృద్ధి బాధ్యత అధికార, ప్రతి పక్షాల బుజాలపై పడింది. జిల్లాలో కూటమి పార్టీలు పైచేయి సాధించిన నేపథ్యంలో జిల్లా ప్రగతి పరుగులు తీయించాల్సిన బాధ్యత కూటమిపై ఉం ది. 2017 నవంబర్‌లో అప్పటి ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ జగన్ చేపట్టిన పాదయాత్రలో మూడేళ్లలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేసి ఉత్ప త్తిని సైతం ప్రారంభిస్తామని హామీనిచ్చారు. మూడేళ్ల ముగింపు దశకు చేరుకున్నప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. కడప-బెంగళూరు రైల్వేలైన్ పనుల్లో నెలకొన్న స్తబ్ధతను తొలగించి, రాష్ట్ర వాటాను జతపరిచి పట్టాలె క్కించాల్సిన అవసరం ఉరుముతోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు ఉక్కు సంకల్పాన్ని ప్రదర్శించాలి.

కొప్పర్తి పారిశ్రామికవాడలోఏర్పాటు చేయాల్సిన ఎంఎస్ఎంఇ పార్కు తరలింపును నిలవరించాల్సిన బాధ్యత కూటమి ప్రజాప్రతినిధులపై ఉంది. గండికోట నిర్వాసితులకు పరిహారం చెల్లింపుల ప్రక్రియ సాగుతూనే ఉంది. గాలేరు-నగరి ఫేజ్-2 పనులకు గ్రహణం తొలగడం లేదు. కడపలో రూ.12 కోట్లతో ఫుడ్ పార్కును ఏర్పాటు చేస్తానని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. పదేళ్లుగా ఫుడ్‌పార్క్ కాగితాలకే పరిమితమైం ది. ఫుడ్‌పార్క్ ఏర్పాటుతో వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించేది. 2005- 06లో మాజీ సిఎం కీ.శే వైఎస్ఆర్ మైలవరం మండలంలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు చొరవ తీసుకున్నారు. సుమారు 60 ఎకరా లను 128 ప్లాట్లుగా విభజించారు. రూ.7.4 కోట్లతో పనులు చేపట్టారు. 2.8 కోట్ల రూపాయలను వ్యయం చేసినట్లు సమాచారం. అనంతరం ఎటువంటి పురోగతి కనిపించడం లేదు. ఎపికార్ల్‌లో రూ. 255 కోట్లతో పరిపాలనా భవనానికి వ్యయం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో సుప్రసిద్ధ పశువుల పిండాలను సంకరీకరణ ద్వారా వాతావరణానికి తట్టుకోగల నూతన జాతి పశువులను సృజన ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో నిధుల కేటా యింపులు చేయాల్సి ఉంది. రైల్వేకోడూరు ప్రాంతంలో వాణిజ్య పంటల వ్యాపారం సాగుతోంది. నందలూరు ప్రాంతంలోని 200 ఎకరాల్లో హార్టీ కల్చర్ యూనివర్శిటీ మంజూరు చేయిస్తానని ప్రకటించిన హామీ కాగితాలకే పరిమితమైంది. గండికోట పర్యాటక ప్రాజెక్టును గ్రేటర్ క్యానాన్ తరహాలో అభివృద్ధి చేస్తామని ఊదరగొట్టారు. రూ.500 కోట్లతో సుందరంగా తీర్చిదిద్దుతామని గండికోట ఉత్సవాలకు హాజరైన అప్పటి టిడిపి మంత్రు లు హడావుడి చేశారు. జిల్లాలో అమలుకు నోచుకోని అంశాలపై ప్రజా ప్రతినిధులు చర్చకు తీసుకొచ్చి సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

కడప- రాయచోటి ఘాట్ టన్నెల్, కడప-పీలేరు నాలుగు లేన్ల రహదారి ఏర్పాటుకు కృషి చేస్తా. హంద్రీ-నీవా ప్రాజెక్టు పనుల పురోగతికి నిధులు కేటాయింపులు చేయడానికి ప్రయత్నం చేస్తా. దీంతో శ్రీనివాస పురం రిజ ర్వాయర్ ఉపయోగంలోకి వస్తుంది.

**- మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర రవాణ శాఖా మంత్రి.**

### కార్పొరేషన్ అవినీతిని వెలికితీస్తాం

గత పదేళ్లుగా కార్పొరేషన్‌లో అవినీతి ఇష్టారాజ్యంగా నడుస్తోంది. ఇటువంటి అధికార, దుహంకారానికి ముకుతాడు వేస్తాం. కడప ప్రజలు ఎదుర్కొనే సమస్యలను ప్రభుత్వం దృష్టి తీసుకెళ్తాం. కడప నగర మనసుల్ని చూరగొనే ప్రయత్నం చేస్తాం.

**- ఆర్.మాధవి, ఎమ్మెల్యే, కడప.**

# రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

## జిల్లా రవాణా అధికారి కె.ప్రసాద్

ముఖా ముఖి..

**ప్రజాశక్తి- రాయచోటి**

జిల్లాలో ప్రతి ఒక్క వాహనదారుడూ ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించి రోడ్డు భద్రత నియమాలు పాటించి, ప్రమాదాల నివారించాలని జిల్లా రవాణా అధికారి కె.ప్రసాద్ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో రోడ్డు భద్రత నిబంధనలు పాటించి వాహనదారులు ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, లైసెన్సులు ఎలా పొందాలి, తదితర అంశాలపై ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన వివరించారు.

**అన్నమయ్య జిల్లాల్లో రవాణా కార్యాలయాల వివరాలు తెలపండి?**

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా రాయచోటిలో జిల్లా రవాణా శాఖ అధికారి కార్యాలయం, మదనపల్లిలో ఆర్‌టిఒ కార్యాలయాలు, రాజంపేట, పీలేరు ప్రాంతాల్లో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాలున్నాయి.

**పాఠశాలల బస్సులకు ఎలాంటి నిబంధన ఉండాలి?**

పాఠశాల బస్సు డ్రైవర్‌కు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి. నిబంధనల కాపీని జతపరచాలి. 750 కిలోమీటర్లకు పైగా బరువు ఉంటే హెవీ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి. ఐదు సంవత్సరాలు సీనియారిటీ ఉండాలి. 60 సంవత్సరాల దాటిన వ్యక్తి డ్రైవింగ్ చేయకూడదు. బస్సులకు పసుపు కలర్ రంగు ఉండాలి. చిల్డ్రన్స్ బొమ్మలు కూడా ఉండాలి. డోర్ పక్కన పాఠశాల అడ్రస్ ఫోన్ నెంబర్ ఏర్పాటు చేసుకోవాలి. అలాగే బస్సులో ఎమర్జెన్సీ దారి ఏర్పాటు చేసుకోవాలి. డ్రైవర్ వెనుక భాగంలో రూట్ మ్యాప్ ఉండాలి. 15 సంవత్సరాలు పూర్తయిన వాహనానికి తిప్పకూడదు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి డ్రైవర్ మెడికల్ సర్టిఫికెట్ తెచ్చుకోవాలి. బస్సు పూర్తి కండిషన్‌లో ఉండాలి.

**అధిక చార్జీలు వసూలు చేసేవారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?**

ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో రవాణాశాఖ ఎన్నికలు నిర్వహించి అక్టోబర్‌లో మొత్తం 661 చలానా నమోదు చేసి రూ.6,37,4,375 జరిమానా విధించాం. వాహనదారులు పన్ను సకాలంలో చెల్లించాలి. వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను ఎల్లప్పుడూ తమ వద్ద ఉంచుకోవాలి. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతూ ఉంటాయి. అధిక ఛార్జీలు వసూలు చేసే వారి పైన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చేశాం. రోడ్ టాక్స్‌లు చెల్లించకపోవడం, పర్మిట్ లేకుండా తిరగడం, అనుమతులు లేకుండా సరుకులు రవాణా చేయడం, ప్రయాణికుల నుండి అధిక చార్జీలు వసూలు చేయడం, రెండో డ్రైవర్ లేకపోవడం వంటివి చట్ట విరుద్ధం. ఇప్పటి వరకు బస్సులపై కేసులు నమోదు చేశాం. నిబంధన లోబడి బస్సులు నడపాలి. నడపాలని ప్రయివేట్ ట్రావెల్స్ యాజమాన్లకు స్పష్టంగా తెలియజేయడమైంది.

**డ్రైవింగ్ లైసెన్స్ ఏ పద్ధతిలో మంజూరు చేస్తున్నారు ?**

డ్రైవింగ్ లైసెన్స్‌లు పొందడానికి రెండు దశలు ఉన్నాయి. తాత్కాలిక లైసెన్స్ పొందడం, శాశ్వత లైస్ గురించి పొందడం. మాన్యువల్ టెస్టింగ్ స్థానంలో కొత్తగా సాంకేతిక విధానాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించాయి. డ్రైవింగ్ లైసెన్స్ టెస్ట్ విధానంలో కొత్త మార్పులను తీసుకొస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మోటర్ వెహికల్ చట్టానికి అనుకులంగా లైసెన్సులు జారీ చేస్తున్నాం. ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలి. ఎపి ఆర్ఎ డాట్ సిటీజన్‌లో చలానా కట్టుకోవాలి. లేకపోతే మీ సేవలో చలానా కట్టుకొని కట్టుకోవాలి. 18 సంవత్సరాల పూర్తయిన వారు. మాత్రమే అర్హులు. రవాణా అధికారుల పర్యవేక్షణలో డ్రైవింగ్ విధానాన్ని వాహనదారుడు వాహనాన్ని నడిపితే ఆర్‌టిఒ సంతృప్తి చెందుతూ అతనికి లైసెన్స్ మంజూరు చేస్తారు. లైసెన్సులను కూడా ఇంటికి పంపిస్తున్నాం. 50 సంవత్సరాలు కంటే తక్కువ వయసు ఉన్న వారు నాన్ ట్రాన్స్‌పోర్టు లైసెన్స్ కోసం దరఖాస్తుదారుడికి మెడికల్ సర్టిఫికెట్ అవసరం లేదు. 50 సంవత్సరాలు పైబడిన అభ్యర్థులు తప్పనిసరిగా మెడికల్ సర్టిఫికెట్ సమర్పించాలి. లైసెన్స్ కోసం దరఖాస్తుదారులకు ట్రాఫిక్ రూల్స్ రోడ్డు గుర్తులు ఇతర ముఖ్యమైన అంశాలపై అవగాహన కలిగి ఉండాలి. లైసెన్స్ పొందిన 30 రోజుల్లో తర్వాత పర్మినెంట్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలి.

**ఫెయిల్ అయినా అభ్యర్థి ఎన్ని రోజులలో తిరిగి డ్రైవింగ్ టెస్టు హాజరు కావాలి?**

ఫెయిల్ అయిన అభ్యర్థి ఏడు రోజులకు డ్రైవింగ్ టెస్ట్‌కు రవాణా శాఖ కార్యాలయంలో సంప్రదించాలి. ఫెయిల్ అయిన అభ్యర్థి ఒక నెల తర్వాత దరఖాస్తు చేసుకోవాలి. ఈ నెల లోపల వాహన దారుడు డ్రైవింగ్ శిక్షణ తీసుకుని హాజరుకావాలి.

**రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?**

నెలకొకసారి కలెక్టర్ అధ్యక్షతన ఎసిపి ఇతర శాఖలతో ప్రమాదాలపై సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నారు. రోడ్డు ప్రమాదాలకు అరికట్టడానికి స్కూల్స్, కళాశాలలు, డ్రైవింగ్ స్కూల్‌లలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. పదేపదే ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి ఆ ప్రదేశంలో సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది ఆగస్టు నెలలో రోడ్డు భద్రత వారోత్సవాలను కూడా నిర్వహిస్తున్నాం.

**డ్రైవర్లకు సలహాలు, సూచనలు ఇవ్వాలనుకుంటున్నారు ?**

డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వ్యక్తి మాత్రమే వాహనాలను నడపాలి. వాహనం నడుపుతున్న ప్రతి డ్రైవరూ ట్రాఫిక్ నియను నిబంధన పాటించాలి. మద్యం సేవించి వాహనం నడవరాదు. మద్యం సేవించి వాహనదారుడు వాహనాన్ని నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తున్నాం. ద్విచక్ర వాహనం వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి. అలాగే వాహనదారులు సీటు బెల్టు ధరించి ధరించాలి. ఎనిమిది గంటల ప్రయాణం దాటితే 2వ డ్రైవర్‌ను ఏర్పాటు చేసుకోవాలి. రాత్రి వేళల్లో ప్రయాణాలు నివారించాలి. అత్యంత పరిస్థితిలో మాత్రమే ప్రయాణించాలి. 50 సంవత్సరాల దాటినవారు తప్పనిసరి కంటి పరీక్షలు చేయించుకుని డ్రైవింగ్ చేయవలెను. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి అందరూ సహకరించాలి.

# 104 ఉద్యోగుల సమస్యలపై చర్చించాలి

## సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు డిమాండ్

**ప్రజాశక్తి - రాయచోటి టౌన్**

రాష్ట్ర వ్యాపతంగా వైద్య రంగంలో క్రియాశీలంగా క్షేత్రస్థాయిలో గ్రామీణ ప్రజనీకానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్న 104 ఉద్యోగుల సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి బడ్జెట్ కేటాయించి పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు డిమాండ్ చేశారు. ఆదివారం సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు 104 ఉద్యోగులు స్థానిక కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎన్నికల ముందు 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని అధికారంలోకి వచ్చి ఐదునెలలైనా పూర్తి అయినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. గత ప్రభుత్వం లాగే వారి సమస్యలు గాలికొదిలేశారని ఆవేదన వ్యక్తంచేశారు.. ఇచ్చే అరకొర వేతనాలు కూడా సకాలంలో చెల్లించడం లేదని పేర్కొన్నారు. పెరిగిన ధరలకనుగుణంగా జిఒ నెంబర్ 7 ప్రకారం కనీస వేతనాలు రూ. 26 వేలు చేయకుండా నిర్లక్ష్యం వహించడం దారుణమని చెప్పారు. 104 ఉద్యోగులు రమేష్, బాబు, మురళీ నాగిరెడ్డి మాట్లాడుతూ అరబిందో యాజమాన్యం పిఎఫ్ బకాయిలు వారి ఖాతాలలో జమచేయలేదని ప్రభుత్వం చర్యలు తీసుకొని న్యాయం చేయాలన్నారు. ఇక నుండి సర్వీసును ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. వాహనాలకు ఇన్సూరెన్ ఉండదని ఏదయినా ప్రమాదం జరిగితే డ్రైవరకు ప్రమాద బీమా రూ. 25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వాహన మరమ్మతులు కూడా డ్రైవర్లే అప్పులు చేసి చేయిస్తున్నారని చెప్పారు. బిల్లులు ఇచ్చి వాహన రిపేరు ఖర్చులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ఆదుకోవాలని తెలిపారు సమస్యల పట్ల ప్రభుత్వం స్పందిచకపోతే ఈ నెలాఖరు నుంచి సమ్మె కు వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో 104 ఉద్యోగులు రాజు, విశ్వనాధ రెడ్డి, నాగార్జున, వినయ్, వంశీ , విశ్వనాద్, రాము, సోము శ్రీనివాసులు, రాజశేఖర్, మోహన్, బాబ్జాన్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న 104 ఉద్యోగులు

# లింక్ చేయడం సరికాదు

**- ప్రజారోగ్య, వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆస్కార్ రావు**

**ప్రజాశక్తి- రాయచోటి**

ఎఫ్ అర్ఎస్ హాజరు విధానానికి జీతాలకు లింక్ చేయడం సరికాదని ప్రజా రోగ్య, వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆస్కార్ రావు పేర్కొ న్నారు. ఆదివారం పట్ట ణంలోని పిసిఆర్ లాడ్జిలో ఎపి ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం ఉన్నత నాయకత్వం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక నాయకులతో మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ ఎఫ్ అర్ఎస్ (ఫెషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టం)లో లోపాలు సరిచే యకుండానే, ఏదైనా నెట్‌వర్క్ సమస్యలొచ్చి హాజరు పడకపోవడంతో జీతాల్లో కోత విధిస్తున్నారని, ఈ పద్ధతి సరైందని కాదని చెప్పారు. దీనిని ఉపసంహారించకపోతే ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. మరో వైపు గతంలో టిడిపి ప్రభుత్వం బయో మెట్రిక్ ఆధారిత హాజరు విధానం తీసుకు వస్తే దానిని అతిపెద్ద ఉద్యమం ద్వారా ఈ శాఖలో ఫీల్డ్ సిబ్బందికి మినహా యింపును పొందామని చెప్పారు. దురదృష్ట వశాత్తు గత ప్రభుత్వం మరింత ముందుకు వెళ్లి ఎఫ్అర్ఎస్ విధానం తీసుకు వచ్చిందన్నారు. టిడిపి ప్రభుత్వం కొలువు దీరినందున తక్షణమే గతంలో జారీ చేసిన మినహాయింపు ఉత్తర్వులు పునరుద్ధరించి ఫీల్డ్ సిబ్బందికి మినహాయింపును ఇవ్వాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు యర్రపురెడ్డి శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర సంయుక్త ప్రధాన కార్యదర్శి వి. శివయ్య, చిత్తూరు జిల్లా అధ్యక్షులు ఎ. లక్ష్మీ నారాయణ, రాష్ట్ర కోశాధికారి ఎస్ కె. బాబా సాహెబ్, సుధాకర్ రాజు, విజయవర్ధన్ బాబూ, వై.విశ్వనాధ రెడ్డి, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డి. శ్రీకాంత్ రాజు పాల్గొన్నారు.

స్థానిక నాయకులతో మాట్లాడుతున్న ఆస్కార్‌రావు

## 'కనువిప్పు' లఘుచిత్రానికి విశేష స్పందన

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక జిఆర్‌టి హైస్కూల్ లో కనువిప్పు లఘుచిత్ర విజయోత్సవ వేడుక ఘనంగా నిర్వహించారు. సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.మునిగోపాల కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి అయనే అధ్యక్షత వహించగా గౌరవాధ్యక్షులు డాక్టర్ మునిరత్నమయ్య, కార్యదర్శులు వి.యం.నాగరాజు, కరుణాకర్, కోశాధికారి ఉస్మాన్ సాబ్, గౌరవసలహాదారులు డాక్టర్ గొల్లపూడి తిరుపతిరావ్, ప్రొఫసర్ శ్రీనివాసులు, కనువిప్పు కథా రచయిత టిఎస్ఎ కృష్ణమూర్తి, డైరెక్టర్ రాజ అశ్వర్ధ, విశ్రాంత డిస్ట్రిక్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ధనలక్ష్మిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా దర్శకులు రాజా అశ్వర్ధ మాట్లాడుతూ కనువిప్పు చిత్రం యూట్యూబ్‌లో అప్ లోడ్ చేసిన అనతి కాలంలోనే 20 వేల మంది చూసి విజయవంతం చేయడం గర్వంగా ఉందన్నారు. ఈ చిత్రం తీయడానికి నిర్మాతగా సహకరించిన ముని గోపాలకృష్ణ, కథా రచయిత టిఎస్ఎ కృష్ణమూర్తి, నటీనటులు గొల్లపూడి తిరుపతిరావు, ధనలక్ష్మి, ఇతర నటులు, సాంకేతిక సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాగభూషణం, మరసం ప్రధాన కార్యదర్శి లింగాల యుగంధరాచారి, వెంకట రమణ, కనువిప్ప కథనాయకి ధనలక్ష్మి, నాగ భూషణం, వెంకట రమణ పాల్గొన్నారు.

కనువిప్పు విజయోత్సవ సభలో సీనియర్ సిటిజన్స్

# 5వ తరగతి విద్యార్థి ఆత్మహత్య

- బాలుడి మృతిపై అనుమానాలు
- విచారణ చేస్తున్న డిఇఒ
- ప్రిన్సిపల్, వార్డెన్ కారణం : విద్యార్థి సంఘాలు

**సమాజం ఏంటో తెలియని పసి వయస్సు. సాటి పిల్లలతో సరదాగా మాట్లాడడం, ఆటాడుకోవడం మాత్రమే తెలుసు. ఎవరేం అడిగినా.. ఎన్ని ప్రశ్నలు వేసిన వాటికి తెలిసిన సమాధానాలు సక్రమంగా ఎలా ఇవ్వాలో కూడా తెలియని మనసు ఆ పదేళ్ల చిన్నారిది. అందరి పిల్లల్లాగా తమ బిడ్డ కూడా బాగా చదివి, మంచి ప్రయోజకుడు కావాలన్నది తల్లిదండ్రుల ఆశ, ఆకాంక్ష. అందుకోసం ఎపిఆర్ఎస్ నిర్వహించిన ప్రవేశ పరీక్షకు హాజరు పరిచి ఈ ఏడాదే పీలేరు నియోజకవర్గం, కెవి పల్లి మండలం, గ్యారంపల్లిలోని ఆంధ్రప్రదేశ్ బాలుర గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో చేర్చారు. అక్కడ అందరు పిల్లల్లాగే తమ బిడ్డ కూడా బాగా చదువుకుంటున్నాడని గర్వపడ్డారు. ఆదివారం ఉదయాన్నే ఏం జరిగిందో.., ఏంటో తెలియదు. కానీ, రోల్ కాల్ తర్వాత మంచానికి టవల్ తో ఉరి వేసుకున్నట్లు సహ విద్యార్థులు చెప్పారని, అది చూసిన ఉపాధ్యాయులు హుటా హుటినా ఆ విద్యార్థిని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని, అప్పటికే ఆ విద్యార్థి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని చెబుతున్నారు.**

మృతిచెందిని విద్యార్థి , రెడ్డి మోక్షిత్ (ఫైల్‌ఫొటో)

కుమారుడి మృతిపై ఆర్‌డిఒను ప్రశ్నిస్తున్న మోక్షిత్ తల్లి వాణి

**ప్రజాశక్తి-పీలేరు/ కె.వి.పల్లి**

పీలేరు నియోజకవర్గంలోని కె.వి.పల్లి మండలం, గ్యారంపల్లి గురుకుల పాఠశాల విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఎవరూ లేని సమయంలో హాస్టల్‌లో టవ్‌లో ఉరేసుకుని ఆత్మ హత్య చేసుకున్నాడు. అతని మృతిపై పలుమానాలు తలెత్తుతున్నాయి. విద్యార్థి మృతికి ప్రిన్సిపల్, వార్డెన్ కారణమంటూ తల్లిదండ్రులతో కలిసి విద్యార్థి సంఘాలు ధర్నాకు దిగాయి. వివరాలు.. తిరుపతిజిల్లా, చిన్నగొట్టిగల్లు మండలం, చిన్న పుట్టిల్లు దిగువవీధికి చెందిన కృష్ణమూర్తి, వాణి కుమారుడు రెడ్డి మోక్షిత్ (10) అన్నమయ్య జిల్లా కె.వి.పల్లి మండలం గ్యారంపల్లిలోని గురుకుల పాఠశాలలో ఈ ఏడాదే ఐదో తరగతిలో చేరాడు. అక్కడే హాస్టల్‌లో ఉంటున్నాడు. రోజులాగే ఆదివారం ఉదయం 6 గంటలకు విద్యార్థులకు రోల్‌కాల్‌లో విద్యార్థులందరూ ఒక చోట చేరారు. తరువాత రూమ్‌కు వెళ్లిన రెడ్డిమోక్షిత్ మంచానికి టవల్‌తో ఉరేసుకున్నాడు. గుర్తించిన సహ విద్యార్థులు విషయాన్ని ఉపాధ్యాయులకు చెప్పారు. వారు హుటాహుటీనా విద్యార్థిని పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మోక్షిత్ ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని తల్లిదండ్రులుకు, బంధవులకు స్కూల్ యాజమాన్యం ఆలస్యంగా తెలియజేశారు. వారు ఆస్పత్రికి చేరుకుని మృతిపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రోల్‌కాల్ సందర్భంగా అందరు విద్యార్థులతోపాటు తమ కుమారుడు వచ్చాడా, ఒక వేళ వచ్చి ఉంటే అందరికంటే ముందు హాస్టల్‌కు వెళ్లి ఉరివేసుకోవడానికి గల కారణమేంటని ప్రశ్నించారు. అభంశుభం ఎరుగని తమ బిడ్డకు ఉరి వేసుకోవాల్సిన అవసరం ఏమి వచ్చిందని తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్, డిఇఒ సుబ్రమణ్యం సంఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థి ఆత్మహత్యపై ఆరా తీశారు. స్పందించిన వారు విచారణ చేపట్టి హత్య అనే విషయం రుజువైతే నిందతులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కెవిపల్లి ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**పాఠశాలలు విచారణ చేపట్టిన డిఇఒ**

గ్యారంపల్లి గురుకుల పాఠశాల విద్యార్థి మృతి విషయం తెలుసుకున్న అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం ముందుగా గురుకుల పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయులతో జరిగిన ఉదంతంపై విచారణ చేపట్టారు. కార్యక్రమంలో కెవి పల్లి మండల విద్యాశాఖ అధికారి పి. రెడ్డి బాష, ప్రిన్సిపాల్ బ్రహ్మజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**విద్యార్థి మృతికి ప్రిన్సిపాల్, వార్డెన్ లే కారణం**

గ్యారంపల్లి ఆంధ్ర ప్రదేశ్ రెసిడెన్షియల్ స్కూల్లో విద్యార్థి మృతికి పాఠశాల ప్రిన్సిపల్, వార్డెన్ లే కారణం అని ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, పలు విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. మృతి చెందిన విద్యార్థి బంధువులతో కలిసి పీలేరు ప్రభుత్వాసుపత్రి ఆవరణంలోనే ధర్నా చేశారు. ఈ సంఘటనపై విచారణ చేపట్టి బాలుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్‌డిఒ శ్రీనివాస్‌కు విజ్ఞప్తి చేసుకున్నారు. అందుకు స్పందించిన ఆర్‌డిఒ వెంటనే విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నిరసన కార్యక్రమంలో విద్యార్థి నాయకులు అమృత్ తేజ, భాను, మాధవ్ పాల్గొన్నారు.

# ఇన్నోవేషన్ ఫెలోషిప్‌కు 'మిట్స్' విద్యార్థులు ఎంపిక

**ప్రజాశక్తి-మదనపల్లి**

మదనపల్లె సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ చదువుతున్న నలుగురు విద్యార్థులు స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ఇన్నోవేషన్ ఫెలోస్‌కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. బిటెక్ రెండవ సంవత్సరం కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) చదువుతున్న సాయిచరణ్‌రెడ్డి పోరెడ్డి, దేవి శ్రీసంహిత కట్టముడి, జ్యోతి వెంకట్‌రెడ్డి వెల్లపాలెం, సిరిరెడ్డి నందిరెడ్డి ఎంపిక అయ్యారని చెప్పారు. యూనివర్శిటీ ఇన్నోవేషన్ ఫెలోస్ ప్రోగ్రామ్‌ను స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం హస్సో ప్లాట్‌నర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ నిర్వహిస్తుందని, డిజైన్, సృజనాత్మకత, ఆవిష్కరణ వ్యవస్థాపకతతో క్యాంపస్ ఎంగేజ్‌మెంట్‌ను పెంచడానికి అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం వారు ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమం ను నిర్వహిస్తారని అన్నారు. ఈ యూనివర్శిటీ ఇన్నోవేషన్ ఫెలోస్ ప్రోగ్రాంకు 13 దేశాల్లోని 44 ఉన్నత విద్యా సంస్థల నుంచి 164 మంది విద్యార్థులు యూనివర్శిటీ ఇన్నోవేషన్ ఫెలోలుగా పేరుపొందారని, అందులో మిట్స్ నుంచి నలుగురు విద్యార్థులు ఉన్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు 2025 ఏప్రిల్ లో వారం రోజుల పాటు యూరప్, నెదర్లాండ్‌లో ఉండే యూనివర్శిటీ ఆఫ్ ట్వెంటేలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఇప్పటి వరకు కళాశాల నుంచి 60 మంది ఈ యూనివర్శిటీ ఇన్నోవేషన్ ఫెలోస్‌గా ఉన్నారని అన్నారు. ఇన్నోవే షన్‌కు ఎంపికైన విద్యార్థులను కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్‌చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, ఇంటర్నేషనల్ సెల్ సీనియర్ మేనేజర్ యు.విజయ లక్ష్మి, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

## హత్యలు, అత్యాచారాలు అరికట్టాలి

### -బిఎస్‌పి రాష్ట్ర కమిటీ సభ్యులు తాళ్లపాక సుబ్రహ్మణ్యం

**ప్రజాశక్తి-పుల్లంపేట**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి జరుగుతున్న టువంటి హత్యలను, అత్యాచారాలను అరికట్టాలని బిఎస్‌పి రాష్ట్ర కమిటీ సభ్యులు తాళ్లపాక సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బహు ఃజనులైన ఎస్‌సి, ఎస్‌టి,బిసి, మైనార్టీ వర్గాలపై జరుగు తున్న అఘాయిత్యాలను ఆపి వారి రక్షణ కొరకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం పక్కాగా అమలయ్యే కార్యచరణలో ఎటు వంటి అల సత్వం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో బిఎస్‌పి నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

## తెలుగు భాష అభ్యున్నతికి బ్రౌన్ సేవలు అమోఘం

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

తెలుగు భాష అభ్యున్నతికి సి.పి.బ్రౌన్ సేవలు అమోఘమని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు క్రిష్ణారెడ్డి కితాబునిచ్చారు. సిపి.బ్రౌన్ జయంతిని పురస్కరించుకొని ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సాహిత్యానికి విశేష సేవ చేసిన ఆంగ్లేయుడు అన్నారు. తొలి తెలుగు శబ్దకోశమును ఈయనే పరిష్కరించి ప్రచురించారని తెలిపారు. బ్రౌన్ డిక్షనరీని ఇప్పటికి తెలుగులో ప్రామాణికంగా ఉపయోగిస్తారని గుర్తుచేశారు. తెలుగు జాతికి సేవ చేసి ఆంధ్ర భాషోద్ధారకుడుగా గౌరవించబడిన మహాను భావుడు అని కొనియాడారు. వేమన పద్యాలను సేకరించి, ప్రచురించి, ఆంగ్లంలో అనువదించి తెలుగు వెలుగులు విశ్వవ్యాప్తం చేసిన మహోన్నత వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. **వాల్మీకిపురం:** స్థానిక తరిగొండ రోడ్డులోని ఉర్దూ మైనార్టీ గురుకుల పాఠశాలలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సిపి బ్రౌన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపి బ్రౌన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. జెవివి జిల్లా అధ్యక్షులు ప్రభుచరణ్ మాట్లాడుతూ సిపి బ్రౌన్‌గా తెలుగు వారికి తెలిసిన చార్లెస్ ఫిలిఫ్ బ్రౌన్ 1798 నవంబర్ 10న కలకత్తాలో జన్మించారని, తండ్రి మరణంతో వీరి కుటుంబం తిరిగి ఇంగ్లాండ్‌కు వెళ్లిపోయిందన్నారు. 1840లో తెలుగు వ్యాకరణం ప్రచురించారని, నలచరిత్ర, పలనాటి వీరచరిత మొదలైన వాటిని ప్రచురించారన్నారు. తెలుగుబాషా సాహిత్యం కోసం తన జీవితాన్ని ఖర్చు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నవమల్లిక, ఉపాధ్యాయులు సోఫియా బేగం, నందిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గురుప్రసాద్

## 14న మాదిగల ఆత్మీయ సదస్సు

**ప్రజాశక్తి-కలికిరి**

ఈనెల 14న మదనపల్లిలో నిర్వహించే మాదిగల ఆత్మీయ సదస్సులో మాదిగ సోదరులంతా పాల్గొని విజయవంతం చేయాలని ఎంఎస్‌పి కలికిరి మండ ఇన్‌ఛార్జి మంద గురు ప్రసాద్ పిలుపునిచ్చారు. మండలంలో ఎంఎస్‌పి నాయకులు మంద గురు ప్రసాద్, సీనియర్ నాయకులు అరవీటి రమణ ఆధ్వర్యంలో వేర్వేరుగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అభినవ అంబేద్కర్, మహాజన నేత మందకృష్ణ మాదిగ గత 30సంవత్సరాలుగా మాదిగ, మాదిగ ఉపకులాల ఉజ్వల భవిష్యత్ కోసం పోరాటాలు చేశారని అన్నారు. అనేక రకాల మిలిటెంట్ ఉద్యమాలు చేసి జాతి చిరకాల ఆకాంక్ష ఎస్‌సి వర్గీకరణ సాధించారని అన్నారు. కార్యక్రమం లో కలికిరి మండలం నాయకులు చీకటి పల్లి వినోద్, పల్లవోలు వెంకటేష్ , నాగయ్య పాల్గొన్నారు.

## నేడు తంబళ్లపల్లెలో ఉచిత వైద్య శిబిరం

**ప్రజాశక్తి-తంబళ్లపల్లె**

మండల కేంద్రంలోని ఐటిఐ ఎదురుగా పాత జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం మదనపల్లి సాయి సంజీవిని కిడ్నీ స్టోన్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వైద్య శిబిరం ఉంటుందన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో యూరాలజీ, కిడ్నీ, ప్రొస్టేట్ సమస్యలు, గైనిక్ సమస్యలు, అపెండిక్స్, హెర్నియా, ఫైల్స్, ఫిస్టులా, థైరాయిడ్ తదితర వ్యాధులకు వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందచేస్తారని అన్నారు. మండల ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## కంప చెట్లు తొలగించరూ..

**ప్రజాశక్తి-వీరబల్లి**

మండల కేంద్రం నుంచి పోలుచెన్నారెడ్డిగారిపల్లి మీదుగా వంగిమళ్ల కస్పాకు వెళ్లే ప్రధాన దారికి ఇరువైపులా కంప చెట్లు ఏపుగా పెరిగాయి. వాహనదారులకు అసౌకర్యంగా మారింది. పంచాయతీరాజ్ అధికారులు కంప చెట్లు తొలిగించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. మరో వాహనం ఎదురుగా వచ్చినప్పుడు రోడ్డు ప్రక్కకు వెళ్లలేని పరిస్థితి ఎదురవుతోందని వాహన దారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనపడటం లేదని చెబుతున్నారు. దీంతో ప్రమాదాలకు ఆస్కారం కలుగుతుందని అన్నారు. పోలుచెన్నారెడ్డిగారి పల్లెకు రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు వేపుగా పెరిగి ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తున్నాయని విఆర్‌డిఎస్ సురేందర్ రెడ్డి తెలిపారు. పంచాయతీ అధికారులు స్పందించి కంపచెట్లు తొలగించి ప్రమాదాలు జరగకుండా నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన కంప చెట్లు

# టిప్పు సుల్తాన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

**ప్రజాశక్తి-రాయచోటి**

టిప్పు సుల్తాన్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని టిడిపి పట్టణ అధ్యక్షులు భువనమాల ఖాదర్‌వలి పేర్కొన్నారు. ఆదివారం టిడిపి ఆధ్వర్యంలో సుండుపల్లి రోడ్డులోని టిప్పు సుల్తాన్ సర్కిల్ వద్ద టిప్పు సుల్తాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాదర్‌వలి మాట్లాడుతూ ఉత్తర భారతాన్ని హస్తగతం చేసుకున్న ఈస్ట్ ఇండియా కంపెనీ పాలకులు, దక్షణ భారతాన్ని ఆక్రమించుకోవటానికి కుట్రలు, కుయుక్తులు పన్నుతున్న సందర్భంగా సామ్రాజ్యవాద శక్తుల రాజ్యవిస్తరణ కాంక్షను బహిర్గతం చేస్తూ స్వదేశీయులను ఏకం కమ్మని పిలుపునిచ్చిన దార్శనికుడని అన్నారు. మైసూర్ పులిగా ఖ్యాతిగాంచిన టిప్పుసుల్తాన్ 1750 నవంబర్ 10న కర్ణాటక రాష్ట్రంలోని కోలార్ జిల్లా దేవనహళ్ళి గ్రామంలో జన్మించారని అన్నారు. చిన్నతనంలోనే యుద్ధకళను ఔపోసన పట్టిన టిపూ సుల్తాన్ తండ్రితోపాటుగా పలు యుద్ధాలలో పాల్గొంటూ వచ్చారు అన్నారు. రాజ్యాన్ని ఉత్తరాన కృష్ణానది నుంచి, దక్షిణాన దిండిగల్ వరకు సుమారు 400 మైళ్ల పొడవునా పశ్చిమాన మలబారు నుంచి తూర్పు కనుమల వరకు సుమారు 300 మైళ్ల విస్తరింప చేశారని అన్నారు. ఆధునిక వ్యాపార, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను ప్రోత్సహించారని అన్నారు. అనంతరం మక్తబే ఇందాదుల్ ఖురాన్ మద్రాసా నిర్వాహకులు హాఫిజ్ ఫర్హాన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి 40 మంది యువకుల చే రక్తదానం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అతావుల్లా, జాఫర్‌వలిఖాన్, ఎజాస్, ఢిల్లీ,ఫిరోజ్ ఖాన్ , రెహమాన్ ఖాన్, ఫతాన్, సహారా సొసైటీ జిలానీబాషా పాల్గొన్నారు. **మదనపల్లి:** బ్రిటిష్ సేనలకు ఎదురు నిలిచి, తన ఖడ్గంతో బ్రిటిష్ సైన్యాన్ని చీల్చి చెండాడి, మాతృభూమికి బ్రిటీషర్ల నెత్తుటి తిలకం దిద్దిన తొలి స్వాతంత్ర్య సమరయోధుడు మైసూర్ టైగర్ టిపూసుల్తాన్ అని, కర్ణాటక ప్రభుత్వం తరహాలో కేంద్ర ప్రభుత్వం ఆయన జయంతి వేడుకగా ప్రకటించాలని భారతీయ అంబేద్కర్ సేన అధినేత పిటిఎం శివప్రసాద్ పేర్కొన్నారు. టిప్పు సుల్తాన్ జయంతి సందర్భంగా బాస్ ఆధ్వర్యంలో స్థానిక బెంగళూరు బస్టాండ్ వద్ద ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు టిపూ సుల్తాన్ నిలువెత్తు చిత్ర పటం ఏర్పాటు చేసి, పలురకాల పుష్పాలతో అలంకరించారు. బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. టిపూ చిత్రపటం ముందు నిలబడి నివాళులు అర్పించారు. రాష్ట్ర నేత టి.ఎ. పీర్ బాషా ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు షాహిద్ బేగ్, ముద్దస్సిర్, మన్సూర్, అస్లాం, ఇమ్రాన్ లతోపాటు బాస్ నాయకులు ముత్యాల మోహన్, నీరుగట్టి రమణ, బురుజు లక్ష్మీనారాయణ, రెడ్డిప్రసాద్, ఇర్ఫాన్, తలారి కృష్ణ, జనార్దన్, గంగాధర్, రవిశంకర్ పాల్గొన్నారు **వాల్మీకిపురం:** భారతదేశ తొలి స్వాతంత్ర్య సమరయోధుడు హజరత్ టిప్పుసుల్తాన్‌ను యువత స్ఫూర్తిగా తీసుకొని మెలగాలని జామియా మసీదు ముతవల్లీ అబ్దుల్ అజీం అన్నారు. టిప్పుసుల్తాన్ యూత్ ఆధ్వర్యంలో టిప్పుసుల్తాన్ 275వ జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ మైసూరు సామ్రాజ్య వ్యవస్థాపకులు టిప్పుసుల్తాన్ ఆంగ్లేయులను భారతదేశం నుంచి తరమిగొట్టడానికి తొలిసారిగా ముందుకు వచ్చిన భారతావని ముద్దుబిడ్డ అని, భారతదేశ ఔనత్యాన్ని చాటిన యోధుడని కొనియాడారు. హిందూ ముస్లిం ఐక్యత కోసం పాటుపడి అనేక మసీదులు, దేవాలయాలు, ప్రార్ధన మందిరాలు నిర్మించిన గొప్ప వ్యక్తి టిప్పు సుల్తాన్ అని కొనియాడారు. కార్యక్రమంలో బాబు, ఫయాజ్, మునవ్వర్, జంషీద్, సయ్యద్‌బాష, చాను, సాధిక్, మత పెద్దలు పాల్గొన్నారు.

రాయచోటి : టిప్పు సుల్తాన్ జయంతి వేడుకల్లో ఖాదర్‌వలి, మైనార్టీ నాయకులు

# పది రూపాయల నోటుకు గిరాకీ..!

- కనిపించని రూ.10 నాణేలు
- మార్కెట్‌లో తగ్గిన కరెన్సీ నోట్ల చలామణి
- ఆందోళన వ్యక్తం చేస్తున్న వ్యాపారులు

**ప్రజాశక్తి-పుల్లంపేట**

మార్కెట్‌లో పది రూపాయల నోటు కనిపించడం గగనంగా మారింది. కిరాణా షాపునకు వెళ్లినా..మందులు కొనాలన్నా..చివరికి బస్సు, ఆటో ఎక్కినా సరే పది రూపాయల నోటు లేకపోవడంతో ఇటు ప్రజలు అటు వ్యాపారస్తులు నానా తంతాలు పడుతున్నారు. ఇది సామాన్యుడికి తీవ్రమైన సమస్యగా మారింది. గత కొంతకాలంగా పది రూపాయల నోట్లు మార్కెట్‌లో పెద్దగా రాకపోవడంతో చిల్లర సమస్య తలెత్తుతోంది. సాధారణ కొనుగోలుకు రూ.1, రూ.2, రూ.5, రూ.10 నాణేలు గతంలో చాలావరకు చలామణిలో ఉండేవి. రూ.20, రూ.50, రూ.100, రూ.200, రూ.500 నోట్లు అత్యధికంగా ఉండటంతో పది రూపాయల నోటు పెద్దగా కనిపించడం లేదు. వీటి కొరత కారణంగా చిన్న వ్యాపారస్తులు, హోటళ్లు, రెస్టారెంట్లు, జనరల్ దుకాణాలు, ఆర్‌టిసి కండక్టర్‌లు, ఆటో డ్రైవర్‌లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. ప్రస్తుతం పది రూపాయల నోటు మార్కెట్‌లో అందుబాటులో లేక వ్యాపారస్తులు ఇబ్బంది లకు గురవుతున్నారు. ఏ వస్తువు కొన్నా ఆన్‌లైన్ చెల్లింపులు పెరుగు తుండడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డిజిటల్ చెల్లిం పులను ప్రోత్సహిస్తోంది. దీంతో అన్ని వర్గాల ప్రజలు ఆన్‌లైన్‌లో చెల్లింపులకు అలవా టుపడ్డారు. ఏ దుకాణానికి వెళ్లినా.. ఏ వస్తువు కొనుగోలు చేయాలన్న డిజిటల్ చెల్లింపులే అనే పరిస్థితి నెలకొంది. గతంలో ఏదైనా నిత్యవసర సరుకులు కొనాలంటే చిల్లర నాణేలతో పాటు నోట్లు కూడా తీసుకొని వెళ్లేవారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో రూ.10, రూ.20 నోట్లు కనిపించకపోవడంతో వ్యాపారస్తులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారుస్తులు, ప్రజల అవస్థలను గుర్తించి రూ.10 నోట్లు, నాణేలను అందుబాటులోకి తీసుక రావాలని కోరుతున్నారు.

# లక్ష సభ్యత్వాలు చేయాలి :'సుగవాసి'

సమావేశంలో మాట్లాడుతున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

**ప్రజాశక్తి-నందలూరు**

తెలుగుదేశం పార్టీ తరపున రాజంపేట నియోజకవర్గంలో ఒక లక్ష సభ్యత్వాలు చేసి నూతన శకానికి నాంది పలకాలని రాజంపేట టిడిపి సీనియర్ నాయకులు సుగవాసి బాల సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ ఎన్టీఆర్ నగర్‌డి. సుబ్బ నరసయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో సుగవాసి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి పరిపాలన, భవిష్యత్తు అందించే పార్టీ టిడిపి అని అన్నారు. రాజకీయాన్ని ఆదాయ వనరులుగా చూసుకునే వారు మనకు వద్దని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధికి మారు పేరని కొనియాడారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఆర్‌టిసి రీజనల్ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు, జిల్లా లీగల్ సెల్ నాయకులు లక్ష్మీనారాయణ, మాజీ ఎంపిపిలు కడవకూటి సాయిబాబా, పల్లె సుబ్రహ్మణ్యం, గీతాంజలి విద్యాసంస్థల అధినేత వెంకటరమణ, గంటా వాసుదేవయ్య, బొబ్బిలి రాయుడు, టిడిపి నాయకులు మోడపోతుల రాము, ఉప్పు శెట్టి రెడ్డయ్య, చక్రాల సాయినాథ్, మాభాష, తాటి సుబ్బరాయుడు, టిడిపి నాయ కులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# చూపులేని వారి జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యం

**ప్రజాశక్తి-పీలేరు**

చూపు లేని వారి జీవితాల్లో వెలుగులు నింపడమే చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ లక్ష్యమని మేనేజింగ్ ట్రస్టీ చాగణం గౌరీ శంకర్, సిఇఒ సీతారామ నాయుడు తెలిపారు. ప్రతి నెలా రెండవ ఆదివారం నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరంలో భాగంగా ఆదివారం పీలేరు ఆర్య వైశ్య కళ్యాణ మండపంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరానికి సుమారు 150 మంది పీలేరు మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన కంటి చూపు సమస్యలతో బాధపడేవారికి తిరుపతి అరవింద నేత్రాలయం వైద్య సిబ్బంది నేత్ర పరీక్షలు చేశారన్నారు. కంటికి సంబంధించిన జబ్బులు ఉన్న 25 మందిని ఆపరేషన్ల కోసం తిరుపతి అరబిందో హాస్పిటల్ కి తీసుకువెళుతున్నట్లు చెప్పారు. వీరికి ఉచితంగా ఆపరేషన్లు చేయించి తిరిగి పీలేరుకు తీసుకు వచ్చి వదిలిపెట్టడం జరుగుతుందన్నారు. 40 మందికి కంటి అద్దాలు, 60 మందికి మందులు ఇచ్చామని అన్నారు. ప్రస్తుత సమాజంలో వైద్యం ఖరీదైనదని చాగణం గౌరీ శంకర్ ఆధ్వర్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గత సంవత్సరం నుండి ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించి, ఉచిత కంటి ఆపరేషన్ చేయించడం ట్రస్ట్ ముఖ్య లక్ష్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఏఒ కృష్ణ గల్లా, అరవింద నేత్రాలయం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

దంపతులకు మెడికల్ కౌన్సిలింగ్ ఇస్తున్న డాక్టర్ సంహిత

## ఉచిత సంతాన సాఫల్య శిబిరానికి విశేష స్పందన

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

చెన్నైలోని ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రి ప్రశాంత్ ఫర్టిలిటీ సెంటర్ ఆధ్వర్యంలో స్థానిక సొసైటీ కాలనీలోని శ్రీదేవి ఆసుపత్రి సౌజన్యంతో రెండు రోజుల పాటు నిర్వహించిన ఉచిత సంతాన సాఫల్య శిబిరానికి విశేష స్పందన లభించిందని డాక్టర్ సంహిత తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆమె మాట్లాడుతూ శని, ఆదివారాల్లో నిర్వహించిన ఈ ఉచిత సంతాన సాఫల్య శిబిరానికి సుమారు 200 మంది సంతానం లేని దంపతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని అన్నారు. వారందరికీ ఉచితంగా స్కానింగ్, వీర్య పరీక్షలు, కౌన్సిలింగ్, సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇందులో కొంతమందిని చెన్నై ప్రశాంత్ ఫెర్టిలిటీ సెంటరును సంప్రదిం చాలని సూచించామన్నారు. ఈ సెంటర్‌లో గత 40ఏళ్ల పాటు దేశ, విదేశాలకు చెందిన వారికి వైద్యం అందిస్తూ, అంతర్జాతీయ టెక్నాలజీతో వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. పిల్లలు లేనివారు తాము తెలియజేసిన సలహాలు, సూచనలు పాటిస్తే ఖచ్చితంగా సంతానం పొందవచ్చని అన్నారు. ఏదైనా సమస్య ఉంటే వారికి పిల్లలు కలిగేలా చెన్నైలోని ప్రశాంత్ ఫర్టిలిటీ సెంటర్, మదనపల్లి శ్రీదేవి హాస్పిటల్ ద్వారా ప్రత్యేక వైద్యం అందిస్తామని చెప్పారు. సంతానం లేని వారికి సంతాన భాగ్యం కల్పించి వారి కలలను సాకా రం చేయడమే తమ లక్ష్యమని అన్నారు. ఈ శిబిరంలో ప్రశాంత్ ఫర్టిలిటీ సెంటర్ మేనేజర్ యశ్వంత్, డాక్టర్ సుజాత, శ్రీదేవి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు :సిఐ

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వన్ టౌన్ సిఐ చాంద్‌బాషా పేర్కొన్నారు. రోడ్డు భద్రతా కార్యక్రమంలో భాగంగా ఆదివారం సిఐ చాంద్ బాషా తమ సిబ్బందితో కలిసి రోడ్డు ప్రమాదాలకు నిలయంగా ఉన్న ప్రాంతాలను గుర్తించారు. అమ్మచెరుమిట్ట, మదనపల్లె నుంచి కదిరి రోడ్డు వద్ద బారికేడ్‌లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ అతివేగం, రోడ్డు భద్రత నియమాలను పాటించకపోవడం వల్ల, రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయని అన్నారు. ప్రమాదాలను నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు భద్రత కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలలో బారికేడ్లను ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నామని చెప్పారు. వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించడంతో పాటు వాహనాలను నెమ్మదిగా నడపాలని తద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ పోలీసులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతకై బారికేడ్లను ఏర్పాటు చేస్తున్న సిఐ చాంద్‌బాషా

పొలంలో కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు

## ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

**ప్రజాశక్తి-గాలివీడు**

మండలంలోని ఎగువగొట్టివీడు గ్రామం గొల్లపల్లి దగ్గర పంట పొలాల్లో 11కెవి విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయని రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎవరైనా అటు వెళ్లి పొరపాటున పట్టుకుంటే ప్రాణపాయం సంభవించే ప్రమాదం ఉందని అన్నారు. పొలాల వద్దకు రైతులు, పశువులు వెళుతంటాయని ప్రమాదం జరగకముందే విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## 18 ఏళ్లు నిండిన యువత ఓటు నమోదు చేసుకోండి

**ప్రజాశక్తి-పుల్లంపేట**

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల వద్ద బిఎల్‌ఒలు ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యాప్తంగా ఉన్న పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ అరవింద్ కిషోర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులకు ఓటు హక్కు కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద జరుగుతున్న దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు సలహాలు అందించారు. ఈనెల 23, 24 తేదీలలో కూడా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ రోజులలో బూత్ లెవెల్ అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద ముసాయిదా ఓటర్ల జాబితా ఫారం 6,7 లతో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బిఎల్‌ఒ కల్పన, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా గంగమ్మ విగ్రహ ప్రతిష్టాపన

**ప్రజాశక్తి-రామసముద్రం :** మండలంలోని కురిజల పంచాయతి దొడ్డిపల్లి గ్రామంలో పాతూరు గంగమ్మ నూతన విగ్రహ ప్రతిష్ట ఆదివారం వైభవంగా నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి పూజలు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మంగమ్మ , మాజీ ఎంపిటిసి దొడ్డిపల్లి ఆనంద, చంద్రకళ, శాంతమ్మ, రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

## విద్యార్థి మృతిపై విచారణ జరిపించాలి

**ప్రజాశక్తి-రాయచోటి :** పీలేరు నియోజవర్గంలోని కె.వి మండలం గురుకుల పాఠశాలలో విద్యార్థి మోక్షత్ మృతిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యురాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని డైట్ పాఠశాలలో మాట్లాడుతూ ఐదో తరగతి చదువుతున్న విద్యార్థి ఉరి వేసుకొనేంతటి వయస్సా అని ప్రశ్నించారు. ఒక వైపు విద్యార్థి తల్లీ మాత్రం తమ కొడుకు మృతిపై అనుమానలు వ్యక్తం చేస్తున్నారని అన్నారు. స్కూల్‌కు వెళ్లే సమయంలో విద్యార్థి ఉరి వేసుకుంటున్నాడంటే టీచర్స్ ఏం చేస్తున్నారని అన్నారు. ఇది పూర్తిగా అక్కడి ప్రిన్సిపల్, టీచర్స్ దే బాధ్యతని వారి పైన క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## అసభ్య పోస్టులు పెడితే చర్యలు తప్పవు

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెడితే మూల్యం చెల్లించుకోక తప్పదని టిడిపి రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె వెంకటేష్ హెచ్చరించారు. ఆదివారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో వైసిపికి సంబంధించిన కార్యకర్తలు సోషల్ మీడియా వేదికగా రెచ్చిపోతున్నారని అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కుమార్తెలను ఉద్దేశించి అసభ్యకర పోస్టులు పెట్టడంతో ఆయన తీవ్రంగా స్పందించి హోంమంత్రిపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందేనన్నారు. సోషల్ మీడియా వేదికగా ఇలాంటి పోస్టులు పెడుతున్న వారి తాటతీయాలని పరోక్షంగా హెచ్చరించారని అన్నారు. గత వైసిపి పాలనలో ఆ పార్టీకి చెందిన వారు సోషల్ మీడియా వేదికగా ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు, వారికి సంబంధించిన మహిళల పట్ల అసభ్యకరమైన పోస్టులు పెట్టే విష సంస్కృతికి బీజం వేశారని విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో కార్యకర్తలు ఎంతో క్రమశిక్షణతో మెలుగుతున్నారని ప్రశంసించారు. ఉప ముఖ్యమంత్రి వ్యాఖ్యలతో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తూ కేసులను పెట్టి బయటికి లాగుతోందన్నారు. ఇది రాష్ట్రానికి మంచి సంకేతమన్నారు. మున్ముందు సోషల్ మీడియా మంచి అంశాలు చర్చించేందుకు చక్కటి వేదిక కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామకమిటీ అధ్యక్షులు మల్లికార్జున, పి.రవి, శివకృష్ణ పాల్గొన్నారు.

## ఘనంగా సీతారాముల కల్యాణం

**ప్రజాశక్తి-రాయచోటి**

మండల పరిధిలోని దిగువఅబ్బవరం, ఇందుకూరుపల్లెలో ఆదివారంశ్రీ సీతారాముల కల్యాణం వైభంగా జరిగింది. ఈ మహోత్సవానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు టిడిపి నాయకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఆయనకు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు.

# క్రైం కార్నర్

## చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

**ప్రజాశక్తి-గాలివీడు**

పెట్రోలు పెసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన అక్కులమ్మ అనే వృద్ధురాలు కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని నూలువీడు పంచాయతీ ఆవులవాండ్లపల్లికి చెందిన తుమ్మల అక్కులమ్మ అనే వృద్ధురాలు శనివారం సాయంత్రం ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు చెప్పారు. చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి మనవడు తుమ్మల గణేష్ ఆదివారం పోలీసు స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎఎస్ వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నా రు.

## 20 లీటర్ల నాటుసారా స్వాధీనం

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

అక్రమంగా నాటుసారా తరలిస్తున్న ఓ వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సారా తయారీ, విక్రయాలపై తనిఖీలు నిర్వహిస్తుండగా బసినికొండలో నివాసముం టున్న ఎం.గౌతమ్ అనే వ్యక్తి పుంగనూరు రోడ్డులోని నగరవనం వద్ద నాటు సారా తరలిస్తూ పట్టుబడ్డారని అన్నారు. నిందితున్ని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 250 ఎం.ఎల్ పరమాణం కలిగిన 80 ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు, అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

నిందితుడి అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు